క్లుప్తంగా

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

మార్టూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో ఎస్సై కే కమలాకర్ తమ బృందంతో మంగళవారం పేకాట శిబిరంపై దాడి నిర్వహించారు. గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోనికి తీసుకొని వారి నుంచి రూ.4,720 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఏఎస్ఐలు సైదా, బాషా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల వ్యతిరేకి చంద్రబాబు

చీరాల: దళితుల వ్యతిరేకి చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ సంయుక్త కార్యదర్శి పేర్లి నాని విమర్శించారు. ఎస్సీల మధ్య చిచ్చుపెట్టేందుకు మంగళవారం టీడీపీ ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఎస్సీల్లో ఎవరు పుట్టాలని మీడియా సాక్షిగా మాట్లాడిన చంద్రబాబు నేడు ఎస్సీల మధ్య ప్రేమ ఉన్నట్లుగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేయడంపై మండిపడ్డారు. చంద్రబాబు మాటలు దళితులు నమ్మేస్థితిలో లేరని, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు.

మద్యం అమ్ముతున్న మహిళ అరెస్టు

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన ఎస్ పద్మ అనే మహిళ మండలంలోని ప్రభుత్వ దుకాణాల వద్ద మద్యం సీసాలు కొనుగోలు చేసి అక్రమంగా అమ్ముకునేందుకు నిల్వ ఉంచినట్లు ఎస్ఐ కే సురేష్ తెలిపారు. తమకు ముందుగా వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి మంగళవారం దాడి చేసి ఆమె దుకాణంలో దాచి ఉంచిన సుమారు రూ.1500 విలువ కలిగిన 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆమెను అరెస్టు చేశామన్నారు. కోర్టు ఆమెకు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

డిగ్రీలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభం

అద్దంకి రూరల్: అద్దంకి శింగరకొండ సమీపంలోని కట్టారామకోటేశ్వరరావు డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ వి. మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ, ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్‌సీ గ్రూపుల్లో దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు తెలిపారు. జులై 5వతేదీ వరకు ప్రవేశాలు జరుగుతాయని వివరించారు.

నేడు కోదండరామస్వామి దేవాలయ ప్రతిష్ట

జే.పంగులూరు: మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో నిర్మించిన కోదండరామస్వామి దేవాలయ ప్రతిష్ట నేడు జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో గ్రామస్తుల సహకారంతో తిరుమల, శ్రీశైల నాథన్ అయ్యవారు (పెద్ద అయ్యవారు) అలివేలు మంగతాయార్ల దివ్య దంపతుల మంగళశాసనాలతో, గ్రామ యువత, రామలయ ట్రస్ట్, శిష్య బృందంచే ఆలయ ప్రతిష్ట జగరనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి తరించాలని తెలిపారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

యద్దనపూడి: 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకునేలా ఓటర్లను చైతన్య పరచాలని తహశీల్దార్ వెంకటరెడ్డి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో డీఎల్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు డీఎల్వోలు అందరూ ప్రతి ఒక్క ఇంటికి తిరిగి ఓటు లేని వారిని చైతన్య పరిచి ఓట్లు నమోదు చేసుకునేలా చేయాలన్నారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8, 8ఏ, నమోదు చేయించాలన్నారు. ఓట్ల నమోదులో ఎలాంటి అశ్రద్ధ వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డిటీ మస్తాన్‌రావు, ఆర్ఐ విష్ణు, డీఎల్వోలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి



రైల్వేట్రాక్ వద్ద ఎలక్ట్రికల్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆదేశించారు. మంగళవారం పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. స్వర్ణగేటు వద్ద రైల్వేట్రాక్ మూడో లైను పనులను అలానే అనుబంధంగా అక్కడ డ్రైన్లు, ఎలక్ట్రికల్ పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. అలానే చీరాల-కారంచేడు రోడ్డులోని ఎఫ్‌సీఐ గొడౌన్స్ వద్ద ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ వరకు చీరాల పట్టణ పరిధిలో డ్రైన్ వాటర్ వెళ్లే కాలువలు, పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. డ్రైన్లలో ఉన్న పూడికతీత పనులను వేగవంతం చేయాలన్నారు. పూడిక వలన నీరు పారుదలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. నీరు పారుదల సక్రమంగా చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ ఐసయ్య, ఎలక్ట్రికల్ ఏడి శ్రీనివాసులు, ఏఈ కట్టా రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డ్రైన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం

క్రమశిక్షణతో విద్యార్థులకు మంచి భవిష్యత్



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కరణం, క్లబ్ సభ్యులు



నాగండ్లలో సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీ భ్యులు

చీరాల అర్బన్: విద్యార్థులు క్రమశిక్షణగా ఉంటే మంచి భవిష్యత్ లభిస్తుందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 18 మంది విద్యార్థినులకు సైకిళ్లను మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. విద్యార్థినులకు ఉపయోగకరంగా ఉండేలా సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రోటరీ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలు అనిర్వచనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఐ.బాబూరావు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, బాల వెంకటేశ్వరరావు, బి.హేమంత్‌కుమార్, సుభాషిణి, గుర్రం రాఘవరావు, మామిడాల రాములు, వలివేటి మురళీకృష్ణ, పోలుదాసు రామకృష్ణ, డీవీ సురేష్, చీరాల కృష్ణమూర్తి. జీవై ప్రసాద్, రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పావులూరులో..

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పావులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, నాగండ్ల ప్రాథమికోన్నత పాఠశాలలోని బాలికలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ వారు సైకిళ్లు పంపిణీ చేశారు. రోటరీ జిల్లా 3150 గవర్నర్ టీ రాజశేఖర్ రెడ్డి సహకారంతో పీ బద్రిరెడ్డి, సోమేపల్లి రామ్మోహనరావు ఆర్థిక సహకారంతో ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు భవనం అంజిరెడ్డి, కార్యదర్శి కరి కమలేశ్వరరావు, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బద్రిరెడ్డి, గ్రామ వికాస్ జిల్లా చైర్మన్ జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), వీరగంధం ఆంజనేయులు, అలవల శ్రీనివాసరెడ్డి, ఇంకొల్లు మల్లేశ్వర వరప్రసాద్, హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌తో మేలు



బల్లికురవలో విద్యుత్ సమస్యలపై చర్చిస్తున్న ఈఈ

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రవేశపెట్టిన అదాలత్‌తో సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయని ఆశాఖ ఈఈ ఎస్ మస్తాన్‌రావు అన్నారు. మంగళవారం బల్లికురవ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సమస్యలపై ఏర్పాటు చేసిన అదాలత్‌లో వివిధ గ్రామాల నుంచి 19 అర్జీలు సమర్పించారు. వీటిలో బిల్లులో లోపాలు సబంధించిన 7 అర్జీలు అక్కడిక్కడే పరిష్కరించారు. మిగిలిన 12 అర్జీలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని ఈఈ వివరించారు. కార్యక్రమంలో ఏఈబీ పీ. శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కొప్పరపాడులో గ్రామదర్శిని



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

బల్లికురవ: గ్రామాల్లోని ప్రజలు ఐక్యతతో సోదర భావంతో మెలగాలని సంతమాగులూరు సీఐ ప్రభాకర్ అన్నారు. గ్రామదర్శినిలో భాగంగా మంగళవారం కొప్పరపాడు గ్రామంలోని వైఎస్సార్ కూడలి వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. ఐక్యతతో సాధించలేనిది ఏమి లేదని అభివృద్ధిలో ప్రతిఒక్కరూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కేసులు, పోలీస్ స్టేషన్, కోర్టుల వల్ల సమయం డబ్బు వృథా అవుతుందని సీఐ వివరించారు. కార్యక్రమంలో ఏస్సై వీ.వేమన పాల్గొన్నారు.

ఫలితాలు మరింత బాధ్యతను పెంచాయి



విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల అర్బన్: ఉత్తమ ఫలితాలు తమపై మరింత బాధ్యతను పెంచాయని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.సరళ అన్నారు. మంగళవారం ఈపూరుపాలెంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు పాల్గొని జగనన్న ఆణిముత్యాలు, జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, జగనన్న విద్యాకానుక వంటివి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఇంటర్మీడియట్, పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించామన్నారు. ఫలితాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

250 మంది రోగులకు వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రామాంజనేయులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పమిడిపాడు గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 250 మంది రోగులకు ఒంగోలు కిమ్స్ ఆసుపత్రి వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ బీ.రామాంజనేయులు రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి 35 మందిని శుక్లాలు తీసేందుకుగాను కిమ్స్‌కు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రావి శ్రీధర్, కో ఆర్డినేటర్ టీ రామాంజనేయులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం



బొబ్బేపల్లిలో సర్వే వివరాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణకుమారి



అన్నంబొట్లవారిపాలెంలో అవగాహన కల్పిస్తున్న కన్వీనర్‌లు



స్వర్ణలో అవగాహన కల్పిస్తున్న తహశీల్దారు వెంకటరత్నం

మార్టూరు: సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న సురక్ష పథకం గురించి అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో కే కృష్ణకుమారి పేర్కొన్నారు. బొబ్బేపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం సిబ్బంది, గ్రామ వలంటీర్‌లతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె సర్వే నిర్వహిస్తున్న తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

స్వర్ణ (కారంచేడు): రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష పథకంతో పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని తహశీల్దారు ఎస్ వెంకటరత్నం పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని స్వర్ణ-1 గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజాసమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ధేనువుకొండలో గ్రామంలో జగనన్న సురక్ష నిర్వహణపై వలంటీర్లు, కన్వీనర్లు, అవగాహన కల్పించారు.

పర్చూరు (చినగంజాం): జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని పర్చూరు మండల జేసీఎస్ కన్వీనర్ ముప్పాళ్ల రాఘవయ్య అన్నారు. మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్నంబొట్లవారిపాలెంలో వలంటీర్‌లు, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథుల కన్వీనర్‌లతో సమావేశం నిర్వహించారు.

ప్రతి ఇంట్లో పథకాలతో సంతోషం



ప్రజలతో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

● ఏపీ శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలతో సంతోషం వెల్లివిరుస్తోందని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వ పథకాలకు చెందిన సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమకావడం ఆనందంగా ఉందని లబ్ధిదారులు పేర్కొంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలకు లంచం ఇవ్వడం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నేరుగా సొమ్ము చేతికి వస్తుందని అందుకే రానున్న ఎన్నికల్లో మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే గెలిపించుకుంటామని ప్రజలు అంటున్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, స్థానిక నాయకులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా..



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆమంచి

● నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

చినగంజాం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను ముందుంటానని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. మంగళవారం పర్చూరు పార్టీ కార్యాలయంలో ఆయన మండలంలోని పలు సమస్యల గురించి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన గ్రామాల ప్రజలు ఆయన నేరుగా వచ్చి కలుసుకొని తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఆయన స్వయంగా సమస్యలను విని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. అంతేకాకుండా సమస్యల పరిష్కారంపై అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆయనతో పాటు స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరి

చినగంజాం: పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో కే స్వరూపరాణి అన్నారు. మంగళవారం మండలంలోని మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణను ఆమె పరిశీలించారు. మంగళవారం మెనూ దొండకాయ చట్నీ, చింతపండు పులిహోర, ఉడికించిన గుడ్లను పరిశీలించి ఆమె స్వయంగా రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు ఎస్ చంద్రశేఖర్, పీ హిమవంతేశ్వరి, ఎస్ నాగమల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఉషా నాగేశ్వరి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రవల్లిక పాల్గొన్నారు.

భూరక్షతో సమస్యలకు చెక్

బల్లికురవ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష సమగ్ర భూసర్వేతో భూ సమస్యలన్నీ పరిష్కారమవుతున్నాయని తహశీల్దార్ కె. రవిబాబు అన్నారు. మంగళవారం ముక్తేశ్వరం గ్రామంలో రీ సర్వేకు సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. ఇప్పటికి వేమవరం, కూకట్లపల్లి, కొప్పరపాడు, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, వల్లాపల్లి, బల్లికురవ, కొణిదెన గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. రైతులు తమకున్న హక్కుపత్రాలతో సర్వే టీమ్‌కు సహకరిస్తే కొలతలు వేసి హద్దురాళ్లు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ వివరించారు. సభలో సర్వేయర్లు రాజు, చంద్ర, యేసు, అమర్నాథ్ పాల్గొన్నారు.

కౌలు రైతులు అన్ని పథకాలకు అర్హులు



కౌలు గుర్తింపు కార్డు ఇస్తున్న ఏఓ కాశీవిశ్వనాథ్

వేటపాలెం: సీసీఆర్‌సీ (కౌలు గుర్తింపు కార్డులు) పొందిన రైతులు ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలకు అర్హులవుతారని మండల వ్యవసాయ అధికారి ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద సీసీఆర్‌సీపై రైతులకు అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందిన రైతులు పొలం యజమాని ప్రభుత్వం నుంచి ప్రయోజనాలన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వైపరిత్యాలు జరిగిన సయంలో పంట నష్టం వాటిల్లితే నష్ట పరిహారం అందుతుందని తెలిపారు. బ్యాంకులో పంట రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా పొందాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సునీల్ నాయక్, వీఆర్వో పురుషోత్తం, సత్యనారాయణ, సెక్రటరీ కేవీ శివకుమారి, పి రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ: కౌలు రైతులు గుర్తింపు కార్డులతో పంట నమోదు చేసుకుంటే వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీపై విత్తనాలు ఎరువులు, విపత్కర పరిస్థితుల్లో పరిహారం పొందవచ్చని ఏవో ఎస్‌వీపీ కుమారి అన్నారు. వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాల్లో జరిగిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు.

దాతృత్వ హృదయానికి అభినందనలు

చీరాల: పట్టణంలోని సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కాలేజీలో కళాశాలకు ప్రతి ఏటా సహకరిస్తున్న ఎన్ఆర్ఐ దాతలకు మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత పదేళ్లుగా కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న అన్నదాన కార్యక్రమంలో సహకరిస్తున్న దారా శ్యాంసుధాకర్, సుదీప్తి దంపతులకు కళాశాల అధ్యాపక బృందం సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, జయశీలరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం..

అద్దంకి రూరల్: అద్దంకి విశ్వబ్రాహ్మణ ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బ్రహ్మంగారి దేవస్థానంలో ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. దీనిలో భాగంగా ఇంకొల్లు ఎంఈవో-2గా ఉద్యోగోన్నతి పొందిన అనంతు శ్రీనివాసరావు, వైదన జెడ్పీహెచ్ఎస్‌కు హెచ్ఎంగా ఉద్యోగోన్నతి పొందిన సన్నమూరి మారుతిని సంఘసభ్యులు దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో వీ. సుధాకర్, ఫణిదం శ్రీనివాసరావు, చిరంజీవి, శర్మాచారి, సీహెచ్ శ్రీనివాసరావు, విశ్వరూపాచారి, ప్రసన్నాంజనేయులు, బాపూజి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



పర్చూరులో విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ మోహనరావు



అద్దంకిలో విత్తన దుకాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు



సంతమాగులూరు దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సంతమాగులూరు (అద్దంకి)/అద్దంకి రూరల్: బిల్లులు ఇవ్వకుంటే విత్తన దుకాణాలపై చర్యలు తీసుకుంటామని ఏవో ఆర్ లావణ్య హెచ్చరించారు. మంగళవారం తహసీల్దార్, ఏవో, స్టేషన్ హౌస్ అధికారితో కలిసి పుట్టావారిపాలెం అడ్డరోడ్డులోని నాలుగు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. లక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్‌లో బిల్లులు, సరైన పత్రాలు లేనందున రూ.4.13 లక్షలు విత్తనాలు అమ్మకాలు, ప్రమీలా ట్రేడర్స్‌లో సరైన పత్రాలు లేనందున రూ.43 వేల విలువైన విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు వ్యసాయాధికారి చెప్పారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు విత్తన దుకాణ యజమానులు నమ్మకమైన అనుమతి ఉన్న విత్తనాలనే విక్రయించాలన్నారు. అలా కాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

– అద్దంకి పట్టణంలో తహసీల్దార్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విత్తన దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్‌లు లేకుండా నకిలీ విత్తనాలు అమ్మేవారిపై 420 కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ, ఎస్సై ఆదిలక్ష్మీ, ఏఈవో కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

ఎమ్మార్పీ రేట్లకు మించి అమ్మితే చర్యలు..

పర్చూరు (చినగంజాం): ఎమ్మార్పీ రేట్లు మించి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని పర్చూరు వ్యవసాయ శాఖ ఏడీఏ మోహనరావు హెచ్చరించారు. మండలంలోని పర్చూరు గ్రామంలో విత్తనాల షాపులను ఏడీఏ, ఏవో రామ్మోహనరెడ్డిలు తనిఖీ చేశారు. పర్చూరులోని మహాలక్ష్మి సీడ్స్, సాయికృష్ణ షాపులను తనిఖీ చేశారు.

చానల్ పొడిగింపు పనులు చేపట్టాలి

పర్చూరు (చినగంజాం): గుంటూరు చానల్ విస్తరణకు సంబంధించి నిధులు కేటాయించి పనులు వెంటనే చేపట్టాలని కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో పాటు స్థానిక రైతులు పలువురు మంగళవారం రాష్ట్ర జల వనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌ను విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి సమస్యను విన్నవించి వినతి పత్రం అందజేశారు. గుంటూరు చానల్ పర్చూరు నియోజకవర్గంలోని మండలాల్లోని 53 గ్రామాల్లో లక్ష మంది ప్రజలు, 80 వేల ఎకరాలు సాగు, తాగునీటి అవసరాలు కోసం పోరాడుతున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో పర్చూరు మాజీ ఏఎంసీ చైర్మన్ నరిశెట్టి ఆచార్యులు, సీఐటీయూ నాయకులు కే నాగేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

భూ వివాదంలో మహిళపై దాడి

మార్టూరు: దాయాదుల మధ్య ఆస్తి విషయమై తలెత్తిన వివాదంలో ఓ మహిళపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై మార్టూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై కే కమలాకర్ వివరాల మేరకు.. మండలంలోని ద్వారకపాడు గ్రామానికి చెందిన వెలగా వెంకటలక్ష్మికి సమీప బంధువుల మధ్య గత కొన్నేళ్లుగా భూ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఈనెల 24వ తేదీ జరిగిన ఘర్షణలో వెంకటలక్ష్మిపై వెలగా సుబ్బయ్య, వెలగా రవికిరణ్, వెలగా మాధవిలు కర్రతో దాడి చేయగా ఆమె ఎడమ చేతికి గాయం కావడంతో స్థానికులు అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మంగళవారం రాత్రి వెంకటలక్ష్మి పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదుపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు